క్లుప్తంగా

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

వెంకటాచలం: వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణకు గురువారం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు కరిమెద్దల నరసింహారెడ్డి విచ్చేసి సైన్యం, జవాన్ల త్యాగాలు, ఎన్‌సీసీసీ క్యాడెట్ల బాధ్యతల గురించి వివరించారు. ఫైరింగ్, డ్రిల్, వ్యాయామం, యోగా, ఎన్‌సీసీ సిలబస్‌పై అధికారులు బాల బ్రహ్మచారి మస్తాన్‌వలీ, దీప్తి, హరీష్‌రెడ్డి, జయరాం, ప్రసాద్, జావీద్‌బాషా తదితరులు వివరించారు. క్యాంపును కమాండెంట్ కల్నల్ ఈ.కరంచంద్, సుబేదార్ మేజర్ రాజేష్ కుమార్, సుబేదార్ హేమంత్ కుమార్ పర్యవేక్షించారు.

చంద్రశేఖరపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు కోరారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేయడంతో పాటు గర్భిణుల ఇంటికే వెళ్లి పరీక్షలు చేశారు. హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏలు సుధాకర్, రాధమ్మ, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, కల్పన, శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం తహసీల్దార్ సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ డాక్యుమెంట్లను వీఆర్వోలకు అందజేయాల్సిందిగా సూచించారు. మనుబోలులో 4,950 ఎకరాలకు రీసర్వేను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిని జూన్ 16వ తేదీ నాటికి పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీహరి, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు



కొడవలూరు: వేసవిలో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ ఎంతో శ్రేయస్కరమని లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో విద్యార్థులతో క్యారమ్స్, చెస్‌ను గురువారం ఆడించారు. చెస్‌లో ప్రావీణ్యం సంపాదిస్తే ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంటుందని చెప్పారు.

⇨ కొడవలూరులోని గ్రంథాలయంలో పలు చిత్రాలను విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రాజేశ్వరి మాట్లాడారు. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్య



ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. సంసిద్ధత ఉత్సవాన్ని మైపాడుపాళెంలో జిల్లా పథం డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ అశోక్ కుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మంజుల, లలితాంబ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలపై కన్నెర్ర

- బర్మాషెల్‌గుంటలో 40 ఏళ్లుగా నివాసం
- తక్షణమే ఖాళీ చేయకపోతే కూల్చేస్తామంటూ బెదిరింపులు
- ఇప్పటికే ఆరు గృహాల తొలగింపు
- ప్రత్యామ్నాయం చూపకుండానే హుకుం
- రైల్వే అధికారుల చర్యలతో ఆందోళన

నెల్లూరు(బారకాసు): పేదలపై అధికారులు కక్షగట్టారు. ఇళ్లను తక్షణమే ఖాళీ చేసి వెళ్లాలంటూ హుకుం జారీ చేశారు. ఈ పరిణామాల క్రమంలో ఏమి చేయాలో పాలుపోక నిస్సహాయ స్థితిలో వారున్నారు. వాస్తవానికి రైల్వేట్రాక్ సమీపంలోని బర్మాషెల్‌గుంట ప్రాంతంలో 166 నిరుపేద కుటుంబాలు దాదాపు 40 ఏళ్లకుపైగా నివాసం ఉంటున్నాయి. అయితే ఉన్నపళాన ఖాళీ చేయాలంటూ రైల్వే అధికారులు పట్టుబట్టారు. వీరికి అండగా నిలవాల్సిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమకు పట్టదనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి..

బర్మాషెల్‌గుంట ప్రాంతానికి తూర్పు వైపున కొంత స్థలం ఆర్ అండ్ బీకి చెందింది. ఉత్తరం వైపున జాఫర్‌సాహెబ్‌కెనాల్‌కు సంబంధించిన కొంత ఇరిగేషన్ స్థలం.. పడమర ఉన్న రైల్వే ట్రాక్‌కు మరికొంత ఉంది. ఇక మిగిలినదంతా కార్పొరేషన్‌కు సంబంధించిందే. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఇక్కడివారిది. వీరందరూ కూలీ పని చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రెండేళ్లకోసారి ఇలా హెచ్చరికలు

ఈ ప్రాంతానికి సమీపంలో రైల్వే ట్రాక్ ఉంది. అయితే రైల్వే అధికారులు రెండేళ్లకోసారి ఇక్కడికొచ్చి ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేసేవారు. ఈ తరుణంలో కొత్తగా మూడో రైల్వే లైన్‌ను ఇటీవల నిర్మించారు. ఆ సమయంలో అవసరం మేరకు బర్మాషెల్‌గుంట్‌లోని కొందరి ఇళ్లను తొలగించారు. ప్రత్యామ్నాయంగా ఆదే ప్రాంతంలో మరో చోట నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించడంతో వారంతా చిన్నపాటి గృహాలను నిర్మించుకున్నారు.



బర్మాషెల్‌గుంటలో పేదల నివాసాలు

తాజాగా మరోసారి..

ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందేనంటూ రైల్వే అధికారులు వారం రోజులుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కూలీలను తీసుకొచ్చి ఆరిళ్ల గోడలను కూల్చేయించారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఆందోళనకు దిగారు. ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చేస్తే తమ పరిస్థితి ఏమిటంటూ రైల్వే అధికారులను అడ్డుకున్నారు. దీంతో వారు వెళ్లిపోయారు.

అండగా గత ప్రభుత్వం

బాధిత కుటుంబాలకు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా నిలిచింది. జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను మంజూరు చేసి నిర్మాణాలను చేపట్టింది. అయితే తదనంతరం ఎన్నికలు రావడం..కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో శీతకన్ను వేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల్లో మౌలిక వసతులను కల్పించడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా నిర్మాణాలను లబ్ధిదారులు నిలిపేశారు. ఈ పరిణామాల క్రమంలో బర్మాషెల్‌గుంట వాసులు ఇబ్బంది పడుతున్నారు.

న్యాయం చేస్తామని భరోసా

ఇక్కడి వారికి జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల వెళ్లి పరిస్థితులను ఆరాతీశారు. న్యాయం జరిగేందుకు తన వంతు యత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కనీసం నెలైనా గడువు ఇప్పించి, ఆలోపు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి వారికి కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.



రైల్వే అధికారులు ఇటీవల కూల్చేసిన గృహాలు

రైల్వే స్థలం వరకు తీసుకోవాలి



బర్మాషెల్‌గుంటలో 40 ఏళ్లుగా ఉంటున్నాం. కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాం. ఈ ప్రాంతంలోనే కార్పొరేషన్‌కు స్థలం ఉంది. రైల్వే వారికి సంబంధించిన స్థలాన్ని తీసుకొని మిగిలింది వదిలేసి, చిన్నపాటి ఇళ్ల నిర్మించేలా చొరవ చూపాలి. – కామాక్షి

తక్షణమే వెళ్లిపోవాలంటే ఎలా..?



ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. రైల్వే అధికారులు రెండేళ్లకోసారి వచ్చి తక్షణమే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. ఉన్నట్లుండి వెళ్లిపోవాలంటే ఎలా..? ప్రత్యామ్నాయం చూపాలి. – నాగమణమ్మ

ఇల్లు పూర్తి చేసిస్తే వెళ్లిపోతాం



ఇక్కడ ఉండే వారందరూ నిరుపేదలు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో స్థలాన్ని మంజూరు చేశారు. అందులో గృహాలను కొంతమేరే నిర్మించి ప్రస్తుతం వదిలేశారు. వీటిని పూర్తి చేస్తే ఖాళీ చేసి వెళ్లిపోతాం. మా పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవాలి. – కృష్ణ

పరిష్కారం చూపాలి



ఎప్పుడు ఎవరొచ్చి ఖాళీ చేయమంటారో ననే భయంతో కాలం వెళ్లదీస్తున్నాం. ఉన్నట్లుండి ఖాళీ చేయాలంటే ఎక్కడికెళ్లాలి. పరిష్కార మార్గాన్ని అధికారులు చూపాలి. – గణేష్

పశుపక్షాదుల దాహార్తి తీర్చేందుకు..



అసలే వేసవి.. ఆపై మండుతున్న ఎండలతో ప్రజలతో పాటు మూగజీవాలు విల్లవిల్లాడుతున్నాయి. మనుషులంటే ఏదో ఒక రకంగా తమ దాహార్తిని తీర్చుకుంటారు. అయితే పశుపక్షాదుల అవస్థ అంతా ఇంతా కాదు. ఈ తరుణంలో వీటికి తాగునీటిని అందించాలనే సంకల్పంతో కమిషనర్ నందన్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని మహాత్మా గాంధీనగర్, జీఎన్టీ రోడ్డు, జర్నలిస్ట్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యన సిమెంట్ తొట్లను ఏర్పాటు చేసి అందులో స్వచ్ఛమైన నీటిని నిల్వ చేశారు. నిరంతరం శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని రోజూ అందించాలని ఆదేశించారు. – నెల్లూరు(బారకాసు)

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియం ప్రాంగణంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. దాతగా గడ్డం వెంకటరత్నం వ్యవహరించారు. గడ్డం సంగమయ్య, జీఎం అశోక్, రెయిన్‌బో స్కూల్ అధినేత సుబ్రహ్మణ్యం, సెక్రటరీ స్నేహ సురేష్, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, వేలూరు రంగారావు, రమణయ్యగౌడ్, నలుబోలు బలరామయ్యనాయుడు, అనంతరామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25న పాటలు, డ్యాన్స్ పోటీలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పాటలు, డ్యాన్స్ పోటీలను ఈ నెల 25న నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు తమ ఎంట్రీలను 77299 42543 నంబర్‌కు ఈ నెల 22లోపు పంపాలని సూచించారు. రఘురామిరెడ్డి, అంకిరెడ్డి, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ అనే అంశంపై శనివారం నిర్వహించనున్న కార్యక్రమంలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర నిర్వహణపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలు, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, శ్రీనివాసులు, ఎంహెచ్ఓ చైతన్య, డిప్యూటీ డైరెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

- అల్లీపురం, జనార్దన్‌రెడ్డి కాలనీ మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటి వినియోగానికి ప్రతిపాదనలను అందుకుంటున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కలిసి ప్రతిపాదనలపై చర్చించారు. కృష్ణపట్నం పోర్టు, జెన్‌కోకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించారని చెప్పారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సంస్థ డొమైన్ హెడ్స్ రాజేష్ బాబు, సుధీష్, మేనేజర్ కృష్ణచైతన్య పాల్గొన్నారు.
- నగరంలోని జాఫర్‌సాహెబ్ కాలువ అంచున వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం 200 షాపులను ఏర్పాటు చేయనున్నామని, వీటి కోసం ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, మూడు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 21 వరకు స్వీకరించనున్నామని.. టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నామని వివరించారు. 18 ఏళ్లపైబడి వీధి వ్యాపారులుగా నమోదై, గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ పొందిన వారు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- నగరంలోని 45వ డివిజన్లో నెలకొన్న సమస్యలపై కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని కూటమి నేత డాక్టర్ పోకల రవి ఆధ్వర్యంలో అందజేశారు.



మాట్లాడుతున్న నందన్

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వీఆర్ఏలు హాజరై జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లచ్చయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఓబులేసు, వెంకటసుబ్బయ్య, బలరామ్, బుచ్చయ్య, శశికుమార్, సుమన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ విజ్ఞానం పుస్తకావిష్కరణ

నెల్లూరు రూరల్: గ్రంథాలయ విజ్ఞాన వ్యాస సంకలనాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జేసీ కార్తీక్ గురువారం ఆవిష్కరించారు. తొలి ప్రతిని కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజాకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు టేకుముళ్ల వెంకటప్పయ్య, కవి పెరుగు రామకృష్ణ, అరసం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, ఐనకోట రవికుమార్, యర్రబత్తిన మునీంద్ర పాల్గొన్నారు.



వామపక్ష నేతల విమర్శలు తగవు

నెల్లూరు రూరల్: దేశ ప్రతిష్టను దిగజార్చి.. ట్రంప్‌కు ప్రధాని మోదీ మోకరిల్లారంటూ వామపక్షాల నేతలు చేస్తున్న ప్రచారాన్ని బీజేపీ నేత మిడతల రమేష్ ఖండించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. దేశ ప్రతిష్ట దిగజారిందంటూ వారు చేస్తున్న ప్రచారం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పీఆర్వోగా కృష్ణకిశోర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పీఆర్వోగా కృష్ణకిశోర్‌ను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను కమిషనర్ నందన్ గురువారం జారీ చేశారు. పీఆర్వోగా ఉన్న కృష్ణారావు నెల పాటు సెలవుపై వెళ్లడంతో కృష్ణకిశోర్‌ను నియమించారు. బాధ్యతలను ఆయన స్వీకరించారు.

మేయర్‌ను కలిసిన ఆర్వోలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ రెవెన్యూ అధికారులుగా నియమితులైన శ్రీనివాసులు, సమద్.. మేయర్ స్రవంతిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏకాంతసేవను నిర్వహించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

నిబంధనలను గ్యాస్ డీలర్లు పాటించాలి

నెల్లూరు(అర్బన్): గ్యాస్ ఏజెన్సీల డీలర్లు నిబంధనలను పాటించాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు పేర్కొన్నారు. మెట్రాలజీ వారోత్సవాలను పురస్కరించుకొని ఎల్పీజీ గ్యాస్ డీలర్లతో ఆ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెలివరీ బాయ్స్ టిప్పులు, అదనంగా వసూలు చేయకూడదని చెప్పారు. ఈ అంశంపై అమరావతి నుంచి ప్రభుత్వం మానిటర్ చేస్తోందని తెలిపారు. 19 కిలోల సిలిండర్లపై ధర, బరువు ట్యాగ్‌లు తప్పక ఉండాలన్నారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

వీఆర్ హైస్కూల్లో కార్పొరేట్ విద్య

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్లో నిరుపేదలకు కార్పొరేట్ విద్యను అందించనున్నామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. పాఠశాలలో చేపట్టిన ఆధునికీకరణ పనులను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏడాదికి వెయ్యి మందికి చొప్పున అడ్మిషన్లను కల్పించనున్నామని వివరించారు. స్కూల్‌కు సమీపంలో ఉండే ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందజేయనున్నామని చెప్పారు. పాత భవనాలను తొలగించి ప్లే గ్రౌండ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న నారాయణ

చెస్ క్రీడాకారుడికి అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కావలిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో అండర్ - 13 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన నెల్లూరు క్రీడాకారుడు శ్రీరామ్‌చౌదరిని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ అభినందించారు. చిల్డ్రన్స్ పార్కు రోడ్డులోని కురుక్షేత్ర చెస్ అకాడమీలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కోచ్‌లు భరత్‌కుమార్, వెంకటేష్, తల్లిదండ్రులు కిరణ్‌చౌదరి, విజయలక్ష్మికి అభినందనలను తెలియజేశారు.



అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రూ.41 కోట్లతో 339 అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హాజరయ్యారు. తొలుత రోడ్ షోను నిర్వహించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 36వ డివిజన్లో గల తాంబరం వీధిలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ నేతలు చిలకా ప్రవీణ్‌కుమార్, కమలాకర్ హాజరయ్యారు.



రోడ్ షోలో మంత్రి, ఎంపీ తదితరులు

వేదగిరిలో ధ్వజావరోహణ

నెల్లూరు సిటీ: నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజావరోహణాన్ని గురువారం నిర్వహించారు. ఏడు కోనేర్ల వద్ద చక్రస్నానాన్ని జరిపారు. ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

